www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 జూన్ 2025

5

పశ్చిమ గోదావరి



## నేడు పిజిఆర్ఎస్ జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహణ : కలెక్టర్

**ప్రజాశక్తి - భీమవరం**

నేడు సోమవారం జూన్ 30వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా కలెక్టర్ కార్యాలయం, డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చునన్నారు. అదేవిధంగా అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి %Meekosam.ap.gov.in% వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి, వాటి స్థితికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కూడా కాల్ చేయవచ్చని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# చించినాడ పోరాట పటిమ ఆదర్శం

## అమరవీరుల 75వ స్మారక సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



చించినాడ సమరశీల పోరాట చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు

**ప్రజాశక్తి - భీమవరం, యలమంచిలి**

చించినాడ పోరాట పటిమ ఆదర్శనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో అమరువీరుల 75వ స్మారక సభ ఆదివారం సాయంత్రం జరిగింది. సిపిఎం చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, కేతా సూర్యారావు, తెన్నేటి సంపతరావు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించిన సభలో చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు రచించిన చించినాడ సమరశీల పోరాట చరిత్ర పుస్తకాన్ని శ్రీనివాసరావు ఆవిష్కరించి తొలి కాపీని సూర్యారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చించినాడ పోరాట పటిమ ఎంతో ఆదర్శమన్నారు. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మార్కెట్లో సరుకులు కొన్నట్లు ఓటర్లను కొంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మారాలని హితవు పలికారు. 2014లో ఓట్లు, సీట్లతో కేంద్రాన్ని వణికించారని, ప్రస్తుతం మెజార్టీ ఉన్నా మోడీని ఏమీ అనలేకపోతున్నారని విమర్శించారు. మూడు సార్లు రాష్ట్ర పర్యటనకు వచ్చిన మోడీ వచ్చి వెళ్లారే తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతోందని, వాగ్దానాలు ఏమీ అమలు చేయలేదని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీల గురించి ఎవరూ మాట్లాడడం లేదని తెలిపారు. రూ.11 వేల 444 కోట్లు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని జిఎస్‌టి, బకాయిల పేరుతో తీసుకోగా కేవలం రూ.1,534 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ఈ నిధుల వినియోగానికి సవాలక్ష నిబంధనలు పెట్టారని తెలిపారు. ఐదు వేల మంది కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించారని, మరో 3 డిపార్టుమెంట్లకు సంబంధించిన పనులు ప్రయివేటుకు అప్పగిస్తున్నారని తెలిపారు. ఇది నిజమో కాదో టిడిపి చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రం తీవ్ర సమస్యల్లో ఉందని అప్పులు తేకపోతే ప్రభుత్వాలు నడిచే పరిస్థితిలో లేవని తెలిపారు. అయితే ప్రతి కుటుంబమూ లక్షా 20 వేల అప్పుల్లో కూరుకుపోయిందని, దీనిపై ఆలోచన చేయాలని తెలిపారు. 50 లక్షల మంది కార్మికులకు 13 ఏళ్ల నుంచి జీతాలు పెంచలేదని, కనీసం దీనికి జిఒ కూడా ఇవ్వలేదని తెలిపారు. పేదల్లో 2 లక్షల ఎకరాల భూమిని ఎపి ఐఎస్ఆర్ ద్వారా సేకరించారని, ఎన్ని పరిశ్రమలు పెట్టారో, ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలన కావాలంటే సుస్థిర అభివృద్ధి జరగాలన్నారు. అనంతరం జరిగిన సభలో సీతారాం మాట్లాడుతూ చించినాడలో అమరవీరుల త్యాగాల ఫలితంగానే సుదీర్ఘకాలం పాటు ఎర్రజెండా పాలన సాగిందన్నారు. అనేక పోరాటాలకు సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు ప్రత్యక్షంగా నాయకత్వం వహించగా ఆయనకు మాజీ ఎంఎల్ఎ ఆర్ఎస్ గైడ్‌గా ఉంటూ నడిపించే వారిని తెఇపారు. వీరికి కమ్యూనిస్టుడు పుచ్చలపల్లి సుందరయ్య అనేక విషయాల్లో అండదండలు అందించి పోరాటాన్ని ముందుకు నడిపించే వారిని గుర్తు చేశారు. అటువంటి పోరాటాల్లో ఇప్పటితరం కొనసాగిస్తేనే మరలా ప్రజలకు దగ్గరయ్యే అవకాశం ఉందని తెలిపారు. సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు మాట్లాడుతూ 1951 - 53లో ఆనాటి పోలీసు గూండాలు చించినాడ గ్రామం కలగంపూడి పుంతలో ముగ్గురు కమ్యూనిస్టులను చింత చెట్టుకు కట్టి తుపాకీ గుళ్లతో కాల్చి చంపారని, ఆనాటి ఆ ఘటన జరిగే సమయానికి తనకు 16 సంవత్సరాలని, ఆ సంఘటనే తనను కమ్యూనిస్టుగా మార్చిందని, అనంతర కాలంలో అమరవీరుల స్ఫూర్తితో అనేక పోరాటాలకు నాయకత్వం వహించామని తెలిపారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ చించినాడ పోరాట చరిత్ర పోరాడే వారికి స్ఫూర్తినిచ్చిందని, భూస్వాములకు వెన్నులో వణుకు పుట్టించిందని తెలిపారు. పార్టీకి అంకితమై పోరాటమే ఊపిరిగా జీవించే వారు ఎవరైనా ఉన్నారంటే అది ఒక కమ్యూనిస్టులు మాత్రమేనని తెలిపారు. వర్గ పోరాటంలో ఎలా చేయాలో సీనియర్ నేత కేతా సూర్యారావు నుంచి ఎంతో నేర్చుకున్నామని తెలిపారు.



ఆర్ఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితంగానే చించినాడలో 68 సంవత్సరాల పాటు చించినాడ పంచాయతీ 62 సంవత్సరాల పాటు సొసైటీని ఏక చక్రాధిపత్యంగా కమ్యూనిస్టుల పాలన సాగిందని, సిపిఎం అధికారంలో లేకపోయినా కమ్యూనిస్టు పాలనలో చించినాడ గ్రామం ఎంతో ఆదర్శవంతమని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ చించినాడ పోరాటంలో మహిళల పాత్ర చాలా ఉందన్నారు. ఆనాటి స్ఫూర్తితో చించినాడలో మళ్లీ ఎర్రజెండా రెపరెపలాడుతోందన్నారు. సభా ప్రారంభానికి ముందు ఆనాటి పోరాటంలో పాల్గొన్న నాయకులు అల్లూరి రామకృష్ణంరాజు, పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, జిల్లెల్ల ఆదిలక్ష్మి, తెన్నేటి సంపుతారావు, చెల్లిబోయిన నరసింహమూర్తి దంపతులు అరటకట్ల నారాయణమ్మ, మునకాల గాంధారి తదితరులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా నాయకులు కౌవురు పెద్దిరాజు, చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, కేతా గోపాలన్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జనం

## కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె



నరసాపురం : మాట్లాడుతున్న జెఎసి నేతలు

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తాడేపల్లిగూడెం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జెఎసి ఆధ్వర్యంలో వరుసగా ఏడో రోజు ఆదివారం సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మరిపూడి సతీష్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగ కుండా వెసులుబాటు కల్పిస్తూ కొంతమంది ఉద్యో గులను విధులకు పంపించినట్లు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఏ విధమైన స్పష్టమైన హామీ రాని కారణంగా జెఎసి నాయకుల తీర్మానం మేరకు సోమవారం నుంచి పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి సమ్మెకు వెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, మున్సిపల్ ఇంజినీర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనివల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగినా దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

**నరసాపురం** : మున్సిపాల్టీలో ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె ఏడో రోజుకు చేరింది. కొద్ది రోజులుగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ వివిధ రూపాల్లో నిరసన చేస్తున్నారు. ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.29 వేలు, హెచ్ఆర్‌సి పాలసీ అమలు చేయాలని, రిటైర్డ్ అయిన కార్మికులకు గ్రాడ్యూటీ ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రత్నం, శ్యామ్, కాశీ, వి.ఫణి, ఎం.సత్యనారాయణ, మధు సుజాత, జి.ప్రసాద్, వాసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలి

### పిసిసి అధ్యక్షురాలు షర్మిల



మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

కాంగ్రెస్ అభివృద్ధికి ఐకమత్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. స్థానిక జెపి రోడ్డులోని ఆనంద ఇన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్‌రాజు ఆధ్వర్యంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమాజంలో ముందుగా షర్మిల ఏడు నియోజకవర్గాల నాయకులతో పాటు కార్యకర్తలతో ప్రత్యేకించి మాట్లాడారు. నియోజవర్గ కన్వీనర్లతో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పార్టీ బలోపేతానికి మండల కమిటీలు, గ్రామ కమిటీలు వేయాలని సూచించారు. అంతేకాకుండా నియోజకవర్గ సమన్వయకర్తలు నెలకు రెండు సమావేశాలు వేయాలని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పార్టీ కాంగ్రెస్ అని, అయితే ఓట్లు చీలిపోవడంతోనే మన పార్టీకి నష్టం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా వైసిపి ఓటు బ్యాంకు కాంగ్రెస్ దేనని అన్నారు. డిసిసి హరికుమార్ రాజు తమను పట్టించుకోవట్లేదని, తమకు ఎటువంటి సమాచారమూ ఇవ్వడం లేదని కొందరు నియోజవర్గ కన్వీనర్లు షర్మిల ముందు ప్రస్తావించారు. ప్రతి ఒక్కరూ పార్టీలో అందరినీ కలుపుకొని ముందుకెళ్లాలని, కష్టపడాలని స్పష్టం చేశారు. కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో తన కంటే సీనియర్ నాయకులు పార్టీలో లేరని అయితే పార్టీ ఆదేశానుసారం తాను షర్మిల వెంట నడుస్తానని తెలిపారు. పార్టీలో ఇగోలు ఉంటే ముందుకు వెళ్లలేమని, ఈ విషయాన్ని గమనించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భీమవరం నియోజకవర్గం అంకెం సీతారాం, ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బిజెపిని ధైర్యంగా ఎదిరించే సత్తా ఒక్క కాంగ్రెస్‌కే ఉంది**

బిజెపిని ధైర్యంగా ఎదిరించే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని, అధికారంలో ఉన్న కూటమి పార్టీలైన టిడిపి జనసేన, మాజీ సిఎం జగన్ బిజెపిలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ఎపి పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక జువ్వలపాలెం రోడ్డులోని ఆనంద ఇన్ ఫంక్షన్ మాజీ సిఎం జగన్ బిజెపితో అక్రమ పొత్తు పెట్టుకున్నారన్నారు. వీరందరూ ఎవరికి వారు స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను బిజెపికి తాకట్టు పెట్టారని విమర్శించారు. కేంద్రంలో 11 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో ఒక్క విభజన హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అంతేకాకుండా హామీల అమలుకు నిధులు కేటాయించకుండా, రాష్ట్రానికి రాజధాని నిర్మించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదైనప్పటికీ అప్పులు ఇస్తారని, దీంతో మనతోపాటు రాబోయే తరాలకు కూడా అప్పులు చెల్లించాలని అన్నారు. ఇంత దారుణంగా వ్యవహరిస్తున్న బిజెపికి అధికారంలో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ప్రతిపక్షంలో ఉన్న జగన్ బిజెపికి గులాం గిరి చేస్తున్నారన్నారు. పది సంవత్సరాలు పాటు ప్రత్యేక హోదా ఇస్తామన్న మోడీ ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును 45 మీటర్ల ఎత్తు నుండి 41 మీటర్లకు కుదిస్తున్నారని, దీనివల్ల రాబోయే రోజుల్లో సమస్యలు వస్తాయని అయినా పార్లమెంట్లో ఏ ఒక్క ఎంపీ కూడా మాట్లాడలేదని విమర్శించారు. కేవలం 23 వేల కుటుంబాల ఆర్ఆర్ ప్యాకేజీని మిగుల్చుకోవడానికి బిజెపి ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మోడీ ఏం చేశారని చంద్రబాబు ఎంపీలను తీసుకెళ్లి మద్దతు ఇచ్చారన్నారు. ప్రజల కోసం కాంగ్రెస్ మాత్రమే నిజాయితీగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పార్లమెంటు అధ్యక్షులు కెబిఆర్.నాయుడు, సీనియర్ నాయకులు కనుమూరి బాపిరాజు, ఏడు నియోజకవర్గాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగర తీరంలో పర్యాటకుల సందడి

**మొగల్తూరు** : మండలంలోని పేరుపాలెం, కేపీపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కి ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.



సముద్ర కెరటాలలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

## బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ మరో మూడు నెలలు పొడిగింపు

**ప్రజాశక్తి - నరసాపురం**

నరసాపురం - బెంగళూరులో మధ్య శుక్ర, శనివారాల్లో నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు షెడ్యూల్ గడువు ఈ నెలాఖరుకు ముగియనుంది. ప్రయాణికులు డిమాండ్ పరిగణలోకి తీసుకొని మరో మూడు నెలలు పొడిగించారు. 07153 నెంబర్‌తో నడిచే ఈ రైలు నర్సాపురంలో ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3.50కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30కు బెంగళూరు చేరుకుంటుందన్నారు. తిరిగి అక్కడ 07154 నెంబర్‌తో 10.50 బయలుదేరి ఆదివారం ఉదయం 5 గంటలకు నరసాపురం చేరుకుంటుదని స్టేషన్ మేనేజర్ గణపతి మధుబాబు తెలిపారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

### భయంగుప్పెట్లో ప్రజలు

### పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి - నరసాపురం**

పట్టణంలోని లాక్‌పేట 1వ వార్డు ఏటిగట్టు రోడ్‌లో గల ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్ ప్రస్తుతం ప్రమాదకరంగా గోదావరి వైపు వంగి, నేలకు పడిపోయే పరిస్థితిలో ఉంది. గత కొంతకాలంగా వర్షాలు, గాలుల ప్రభావంతో ట్రాన్స్‌ఫార్మర్ ఆధారాలు బలహీనమవడంతో ఇది ప్రజలకు తీవ్రమైన భయం కలిగిస్తోంది. విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు అనేకసార్లు తెలపినప్పటికీ, సరైన చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్పు తక్షణమే అవసరమని వారు కోరుతున్నారు. ఇదే ప్రాంతంలో విద్యుత్ తీగలు చాలా పాతవిగా మారడంతో చిన్న చిన్న గాలులకు, వర్షాలకు కూడా అవి తెగిపోతున్నాయి. ఫలితంగా అనేక దఫాలు తక్కువ వోల్టేజ్ సమస్య ఏర్పడుతోంది. దీని వల్ల ఫ్రిడ్జీలు, టివిలు, ఇతర విద్యుత్ పరికరాలు దెబ్బతినడమే కాక, లక్షల రూపాయల ఆస్తి నష్టం జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల తీగలు అంతలా తక్కువ ఎత్తులో ఉన్నాయి. చేతికి తాకే విధంగా వేలాడుతున్నాయి. ఇది పిల్లలకే కాక పెద్దలకూ ప్రాణాపాయంగా మారే అవకాశం ఉంది. ప్రమాదకరంగా వున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే సురక్షిత ప్రదేశానికి మార్చాలి. అలాగే అన్ని పాత తీగలను పరిశీలించి, తగిన ఎత్తులో ఉండేలా కొత్త తీగలతో భద్రత చర్యలు తీసుకోవాలని స్థానికులు విద్యుత్ శాఖను కోరుతున్నారు. ప్రజల ప్రాణాలు బలికాకముందే స్పందించాలని వారు హెచ్చరిస్తున్నారు.



వాలిన ట్రాన్స్‌ఫార్మర్

# మిగులు భూములు మింగేశారా..!

**పోలవరం నిర్వాసితులకు అప్పట్లోనే అదనంగా భూముల సేకరణ**

**జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో వెయ్యి ఎకరాల వరకూ మిగులు భూమి ఉన్నట్లు లెక్క**

**మళ్లీ కూనవరం, విఆర్‌పురం నిర్వాసితులకు భూసేకరణ అంటూ అధికారుల హడావుడీ**

**వివాదంలో ఉన్న ఎల్‌టిఆర్ భూముల సేకరణకు కుట్ర**

**ఐటిడిఎ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు**

**మిగులు భూములన్నీ ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఉన్నాయా?**



ఐటిడిఎ కార్యాలయం

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

పోలవరం నిర్వాసితులకు భూసేకరణ పేరుతో ప్రజాప్రతినిధులు, అధికారులు మళ్లీ దోపిడీకి ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కూనవరం, విఆర్‌పురం మండలాల్లో నిర్వాసితులకు భూమికి భూమి, ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ అంటూ బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో అధికారులు హడావుడీ చేస్తున్నారు. 2014-19 మధ్య టిడిపి పాలనలో పోలవరం కోసం చేసిన భూసేకరణలో దాదాపు వెయ్యి ఎకరాల వరకూ అదనంగా ఉందని, అవసరాలకు ఆ భూమి వాడుకుంటామని అప్పట్లో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులే అక్కడి ప్రజలకు చెప్పారు. ఎకరాకు రూ.10.50 లక్షలు వెచ్చించి అప్పట్లో భూములను కొనుగోలు చేసిన పరిస్థితి ఉంది. అప్పట్లో సేకరించిన మిగులు భూములు పెద్దఎత్తున ఉన్నప్పటికీ ఇప్పుడు మళ్లీ భూసేకరణ చేసి భారీగా దోపిడీకి పాల్పడేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కుట్రలు చేస్తున్నట్లు సమాచారం. 2014-19 టిడిపి పాలనలోనే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం జీలుగుమిల్లి, బుట్టాయగూడెంలో పెద్దఎత్తున భూసేకరణ జరిగింది. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాలకు చెందిన నిర్వాసితులతోపాటు, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఏజెన్సీ గ్రామాల నిర్వాసితులకు ఇక్కడ భూమికి భూమి, ఇళ్ల స్థలాల కోసం భూ సేకరణ జరిగింది. ఇక్కడకు తరలించే నిర్వాసితులకు పంపిణీ చేయగా ఇంకా జీలుగుమిల్లి మండలంలో 320 ఎకరాలు, బుట్టాయగూడెం మండలంలో 700 ఎకరాలకు పైగా మిగులు మిగులు భూమి ఉన్నట్లు అప్పట్లో అధికారులు చెప్పారు. ఇప్పుడు కూనవరం, విఆర్‌పురం నుంచి తరలించాలనుకుంటున్న నిర్వాసితులకు ఆ మిగులు భూములు ఇవ్వొచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం దీనికి విరుద్ధంగా మళ్లీ 500లకు పైగా ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం, దొరమామిడి గ్రామాల్లోనూ, జీలుగుమిల్లి మండలంలోని పూచికపాడు, జగన్నాథపురం, అంకన్నగూడెం, జీలుగుమిల్లి, వంకావారిగూడెం, దర్భగూడెం, బర్రింకలపాడు గ్రామాల్లో భూములు సేకరించే పనిలో అధికారులు పడ్డారు. పోలవరం నిర్వాసితుల పేరుతో చేస్తున్న భూసేకరణలో పెద్ద ఎత్తున గూడుపుఠాణి సాగుతున్నట్లు తెలుస్తోంది.

**వివాదాస్పద ఎల్‌టిఆర్ భూముల కొనుగోలుకు కుట్ర**

ఏజెన్సీలో ఎల్‌టిఆర్ (ల్యాండ్ ట్రాన్సఫర్ రెగ్యులేషన్) భూములకు సంబంధించి గిరిజనులు, భూస్వాములకు మధ్య దశాబ్దాలుగా ఘర్షణ జరుగుతోంది. గిరిజనేతర భూస్వాములకు అధికారులు అండగా నిలుస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో భూములకు సంబంధించి గిరిజనులు, గిరిజనేతరుల మధ్య వివాదాలు కొనసాగుతునే ఉన్నాయి. గిరిజనేతర భూస్వాములకు మేలు చేయాలన్న ప్రణాళికతో మరోసారి భూసేకరణకు దిగినట్లు తెలుస్తోంది. వివాదాస్పద ఎల్‌టిఆర్ భూములు కొనుగోలు చేసి ఇతర గ్రామాల నుంచి తరలిస్తున్న నిర్వాసితులకు ఇస్తే.. ఇక్కడి గిరిజనులకు, వచ్చిన వారికి గొడవలు జరిగే పరిస్థితి ఏర్పడనుంది. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే అధికారులు చేస్తున్నట్లు ఏజెన్సీలో చర్చ జరుగుతోంది. ఐటిడిఎ అధికారులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**మిగులు భూములు అనుభవిస్తున్నదెవరు?**

పోలవరం నిర్వాసితుల కోసం సేకరించిన మిగులు భూములు ప్రస్తుతం ఎవరి చేతుల్లో ఉన్నాయో అధికారులు చెప్పడం లేదు. ఆ భూములు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులుగా ఉన్న నేతలు వందల ఎకరాల భూములను లీజులకు ఇచ్చుకుని అక్రమంగా అనుభవిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు ఆ భూములను లీజులకు ఇచ్చుకుని సొమ్ము మింగేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ కారణం చేతే మిగులు భూముల అంశాన్ని మరుగునపెట్టి మళ్లీ భూసేకరణ చేసేందుకు ప్రణాళికలు రచించినట్లు సమాచారం. ఇదంతా ఏజెన్సీలో పనిచేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న కుట్రలో భాగంగా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లా కలెక్టర్, జెసి జోక్యం చేసుకుని మిగులు భూముల సంగతి తేల్చాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.


# కూటమి ప్రభుత్వంలో రోడ్లు, డ్రెయినేజీలకు ప్రాధాన్యత

**ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి**


**కొమరవరంలో రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన**

**ప్రజాశక్తి - తణుకు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం తణుకు మండలం కొమరవరం గ్రామంలోని లక్ష్మీగణపతి నగర్‌లో రూ.37 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రోడ్డునిర్మాణానికి శంకుస్థాపన చేసి అనంతరం రూ.15 లక్షల ఎన్ఆర్‌జిఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. కొమరవరం గ్రామంలో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. కాలనీలో దాదాపు 14 కిలోమీటర్లు మేర రోడ్లు నిర్మించినప్పటికీ అభివృద్ధి చేయకపోవడంతో గత అయిదేళ్లలో ఎలాంటి మరమ్మతులు చేయలేదన్నారు. రాబోయే రోజుల్లో కొమరవరం గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు అందిచడంతోపాటు కొమరవరం, గోపాలపురం గ్రామాల్లో సైతం రెండు వాటర్ ట్యాంకులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. నిధుల సమస్యతోపాటు రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ రాధాకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ


మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

## 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాలి

**ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్**

ప్రజాశక్తి - భీమవరం

ఆర్థిక బకాయిలు చెల్లించి 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గుత్తుల శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక ఎఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్, 11వ పిఆర్‌సి, సరెండర్ లీవ్, ఎపి జిఎల్ఐ, పిఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఇప్పటికే ఆలస్యమై ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోయారని, 12వ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బదిలీలు, ఉద్యోగోన్నతులు పూర్తయినా ఇంకా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో డిఎస్‌సి అభ్యర్థులు వచ్చే వరకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి పాఠశాల విద్యా బోధనకు ఆటంకం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. 2008, 1998 ఎంటిఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల వయో పరిమితికి పెంచాలని, వారిని రెగ్యులర్ విధానంలో నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కెవి.రామచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి పివిడి.ప్రసాద్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



కాళ్లకూరు నుంచి భీమవరం బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు

## 'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - కాళ్ల

కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారని ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు పేర్కొన్నారు. ఆదివారం కాళ్లకూరు గ్రామం నుంచి భీమవరంలో జరిగే వైఎస్ షర్మిలా రెడ్డి పర్యటనకు వేగేశ్న వెంకట గోపాలకృష్ణ రాజు నాయకత్వంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంపై కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, కాంగ్రెస్ యూత్ జిల్లా అధ్యక్షులు సోము నాగ కేశవబాబు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి 'ఎల్‌ఒసి' అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 15వ వార్డు సవిత్రపేటకు చెందిన సమయం జయవిష్ణు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం వారి కుటుంబ సభ్యులు సిఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షలు ఎల్‌ఒసిని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో బాధితుని తండ్రికి ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదగా ఎల్‌ఒసి అనుమతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌ఒసిని మంజూరు చేయించిన ఎంఎల్ఎకి, వార్డు ఇన్‌ఛార్జి అడబాల రామారావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రామారావు, వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, పుల్లా బాబి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న లయన్స్ కృష్ణంరాజు

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు 3 లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం రాత్రి స్థానిక లయన్స్ 'వి' కన్వెన్షన్ హాల్లో జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు నూతన కార్యవర్గ అధ్యక్షులుగా సిఎ బుద్ధన చింతారావు, కార్యదర్శిగా ఎం.దుర్గాప్రసాద్, కోశాధికారిగా కెవి.శివరామరాజు ప్రమాణం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ అభయ నూతన అధ్యక్షులుగా గమిడి వీరకుమార్, కార్యదర్శిగా పుప్పాల సత్యనారాయణ(పండు), కోశాధికారిగా చొప్పర్ల అనిల్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆక్వా అధ్యక్షులుగా కనుమూరు ప్రసన్న బంగారురాజు, కార్యదర్శిగా కొప్పర్తి మణికంఠ మంగరాజు, కోశాధికారిగా వినయ నూతన కార్యవర్గ బాధ్యతలు స్వీకరిస్తూ పదవీ ప్రమాణ స్వీకారాలు చేశారు. ఈ నూతన కార్యవర్గ సభ్యుల చేత లయన్స్ మల్టిపుల్ మాజీ ఛైర్‌పర్సన్ చిలువూరి కృష్ణంరాజు పదవీ ప్రమాణం చేయించారు.

## తాళంవేసివున్న ఇంట్లో చోరీ

**మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు, కిలో వెండి అపహరణ**

ప్రజాశక్తి - మొగల్తూరు

తాళంవేసివున్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటనపై ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు పంచాయతీ కోటప్రాంతానికి చెందిన అద్దంకి శేషారత్నం జూన్ 5న ఇంటికి తాళం వేసి తన మనవడు పుట్టినరోజు వేడుకల నిమిత్తం ఆకివీడులోని విద్యుత్తుశాఖ ఎఇగా విధులు నిర్వహిస్తున్న కుమారుడు లారెన్స్ జేసు రత్నాకర్ ఇంటికి వెళ్లారు. ఈనెల 29న ఆమె, తన కుమారుడుతో కలిసి మొగల్తూరు తిరిగి వచ్చేసరికి ఇంటికి వెనుకవైపున ఉన్న తలుపులు ధ్వంసం చేసి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు, కిలో వెండి, రూ.30 వేల నగదును దుండగులు అపహరించుకు పోయారు. దీనిపై లారెన్స్ జేసు రత్నాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. క్లూస్ టీం అధికారులు సంఘటనా ప్రాంతానికి వచ్చి ఆధారాలు సేకరించారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**రూ.2,350 నగదు స్వాధీనం**

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం స్టేషన్ పేట శివారు ప్రాంతంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం సిఐ బి.యాదగిరి తెలిపారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,350 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సిఐ పేర్కొన్నారు.



# జక్కరం-కోపల్లె వంతెన కలేనా?

**ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు**
**గంటలపాటు నిలిచిపోతున్న ట్రాఫిక్**
**నెరవేరని నేతల హామీలు**
**పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**


శిథిలావస్థకు చేరిన జక్కరం-కోపల్లె వంతెన

ప్రజాశక్తి - కాళ్ల

**జక్కరం-కోపల్లె వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. కొన్నిచోట్ల వంతెన బీటలువారి శిథిలావస్థకు చేరింది. ఇంకొన్ని చోట్ల రెయిలింగులు, రక్షణ గోడలు కూలిపోయాయి. దీనికితోడు భారీ వాహనాల రాకపోకలతో వంతెన మరింత శిథిలావస్థకు చేరింది. అయినా పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల నడుమ ప్రయాణం సాగిస్తున్నారు. జక్కరం-కోపల్లె వంతెన నిర్మిస్తామని నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పాలకులు ఓట్ల కోసం తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించడంతో విఫలమైయ్యారని ఆరోపిస్తున్నారు.**

మూడు దశాబ్దాలుగా ఉన్న కోపల్లె-జక్కరం వంతెనకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఇరుకు వంతెనపై ప్రయాణికులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఎన్నికల్లో గెలుపొందడానికి పలు హామీలు గుప్పించడం, ఆతర్వాత మరిచిపోవడం రాజకీయ పార్టీలకు సర్వసాధారణమైంది. నేతలెవ్వరూ వంతెన నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జక్కరం-కోపల్లె గ్రామాల మధ్య కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు రైతులు కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. బ్రిటిష్ హయాంలో నిర్మించిన ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలతో శిథిలావస్థకు చేరింది. చిన్నవాహనం ఎదురొచ్చినా తప్పుకోలేని పరిస్థితి నెలకొంది. ఇది రాష్ట్రీయ జువ్వలపాలెం రహదారిలో నిత్యం ఎదుర్కొనే అవస్థలు. జువ్వలపాలెం రోడ్డు నుంచి గుడివాడ, విజయవాడ, అమరావతి వెళ్లాలంటే ఈ రోడ్డే ప్రధాన మార్గం. ఈ రహదారిపై ఈ వంతెన ఇరుకుగా ఉంది. ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మిస్తామని గత 30 ఏళ్లుగా నేతలు హామీలు ఇస్తూ వస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజా ప్రతినిధులు మారుతున్నా వంతెన నిర్మాణం మాత్రం జరగడం లేదు.

**నెరవేరని ఎన్నికల హామీ...**

జక్కరం-కోపల్లె వంతెన ఎన్నికల హామీని నెరవేర్చడంలో కూటమి అధికార, ప్రతిపక్ష నాయకులు శ్రద్ధ చూపడం లేదు. మండలంలోని జక్కరం గ్రామానికి చెందిన పాతపాటి సర్రాజు, కలవపూడి గ్రామానికి చెందిన వేటుకూరి వెంకటశివరామరాజు, మంతెన రామరాజు, ఐ భీమవరంకు చెందిన కనుమూరు రఘురామకృష్ణరాజు ఉండి ఎంఎల్ఎలుగా ఎన్నికయ్యారు. ప్రతి సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో వంతెన నిర్మాణం చేపడతామని పాలకులు హామీలు ఇచ్చారు. నిధులు వచ్చాయి. పనులు జరుగుతాయని నాయకులు ప్రసంగాలు చేయడమే తప్ప నిర్మించేందుకు చర్యలు తీసుకోలేదు.

**విజయవాడ వెళ్లేందుకు దగ్గర మార్గం..**

నిత్యం భీమవరం నుంచి విజయవాడ ఇతర పట్టణాలకు వెళ్లాలంటే ఆర్‌అండ్ రోడ్డు దగ్గర మార్గం. రైల్వే గేట్లు తక్కువగా ఉండటంతో ఈ రోడ్డు నుంచి వాహన రాకపోకలు సాగుతున్నాయి. వంతెన రైయిలింగ్ కూలిపోయింది. వంతెన పిల్లర్లపై మొక్కలు పెరిగిపోయాయి.

**ట్రాఫిక్ కష్టాలు..**

రాష్ట్రీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు, ప్రయాణ ఇబ్బందులు తప్పడం లేదు. ఆక్వారంగం గణనీయంగా విస్తరించిన కాళ్ల మండలంలో ఎక్కువగా ఆక్వా ఉత్పత్తులను నిత్యం తరలిస్తుంటారు. బొండాడ మురుగు కాలువపై వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అనేకసార్లు వంతెన నిర్మాణం చేపట్టాలని గతంలో వైసిపి, కాంగ్రెస్ నాయకులు ధర్నాలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల సిపిఎం నాయకులు జక్కరం-కోపల్లె వంతెన సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని, వంతెనను నిర్మించాలని డిమాండ్ చేశారు.

**నిర్మాణం జరగలేదు..**

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఈ వంతెన నిర్మాణానికి కోర్ నెట్వర్క్ నిధులు రూ.12 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచారు. ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం ఎంఎల్ఎ వంతెన ప్రస్తావన తీసుకు రావడం లేదు. ట్రాఫిక్ కష్టాలు లేకుండా చేసేందుకు కొత్త వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

### నూతన వంతెన నిర్మాణంపై దృష్టి సారించాలి

**జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి, భీమవరం**



వంతెన నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జక్కరం-కోపల్లె వంతెన నిర్మాణంపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రజలు, ప్రయాణికుల కష్టాలను గమనించి వంతెన సమస్యకు పరిష్కారం చూపాలి. ప్రమాదకరంగా ఉన్న జక్కరం-కోపల్లె వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన మరమ్మతులు చేయాలి.

### వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం

**కనుమూరు శ్రీహరి రాజు, ఆర్‌అండ్‌బి ఎఇ కాళ్ల**

జక్కరం-కోపల్లె వంతెన నిర్మాణానికి రూ.12 కోట్ల ప్రతిపాదనలు పంపాం. కోర్ నెట్ వర్క్ నిధులు మంజూరు కావాల్సి ఉంది. మంజూరైన తరువాత టెండర్లు పిలిచి వంతెన నిర్మాణ పనులు చేపడతాం.


నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు దంపతులు

## ఎంఆర్.రాజు సేవలు ఎనలేనివి

**మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు**

**కాళ్ల :** భారత ప్రముఖ శాస్త్రవేత్త, గాంధేయవాది, పద్మశ్రీ ఎంఆర్.రాజు సేవలు ఎనలేనివని నరసాపురం పార్లమెంట్ మాజీ సభ్యులు కనుమూరు బాపిరాజు పేర్కొన్నారు. పెదఅమిరం గ్రామంలో ఆదివారం ఎంఆర్.రాజు స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడుతూ ప్రపంచ, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తగా సేవలందించి పెద అమిరంలో ఎంజిఎం ట్రస్ట్ స్థాపించి తద్వారా కేన్సర్ రోగులకు విశేష సేవలందించారన్నారు. భీమవరం ప్రాంతంలో పద్మశ్రీ పురస్కారం అందుకున్న గొప్ప వ్యక్తి అన్నారు. ఎంఆర్.రాజు కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ బాపిరాజు, అన్నపూర్ణ దంపతులు పరామర్శించి తమ సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్.రాజు కుమారులు రామ్‌కుమార్ రాజు, రంగరాజు, మనవడు వెంకటపతిరాజు, కర్ణాటక సూరి, జెఎస్ఆర్, పేరిచర్ల లక్ష్మణ వర్మ, కలిదిండి గోపాలకృష్ణం రాజు, కనుమూరు గోపాలకృష్ణంరాజు, కూనపరాజు రామకృష్ణంరాజు, సీతారామరాజు, భూపతిరాజు సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

## 1 నుంచి సర్పంచులకు శిక్షణ

**నరసాపురం :** వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో మహిళా సర్పంచులకు మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో శిక్షణ తరగతులు జరుగుతాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వికె.వీరభద్రరావు తెలిపారు. మహిళా సాధికారతతో సుపరిపాలన సాధ్యం అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్సు పర్సన్లు శిక్షణ నిస్తారన్నారని ఆయన పేర్కొన్నారు.

## నగదు బదిలీ వద్దు రేషన్ కావాలి

**సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు**

ప్రజాశక్తి - పెంటపాడు

కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యం పక్కదారి వెళ్తున్నాయనే ఉద్దేశ్యంతో రేషన్ వద్దన్న వారికి నగదు బదిలీ చేస్తామని ప్రకటించిందని, నగదు వద్దు రేషన్ కావాలని సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు తెలిపారు. ఆదివారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నాయకులు బొంకూర్ నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కోటి 46 లక్షల మందికి రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. ఈ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాలు నూటికి 80 శాతంగా ఉన్నారని, అటువంటి పేదలకు 1984 నుంచి రేషన్ కార్డు ద్వారా సుమారు 14 రకాల వస్తువులు అందించే వారని, రాను రాను ఈ సరుకులు తగ్గించి ఇప్పుడు ఐదు కేజీల బియ్యం, అరకేజీ పంచదార ఇస్తున్నారన్నారు. ఇది కూడా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని కూడా ఎత్తివేయుటకు సిద్ధంగా ఉందన్నారు. రేషన్ ఇవ్వడం వల్లే ప్రభుత్వం కూడా సివిల్ సప్లై మార్క్ ఫెడ్ ద్వారా రైతుల వద్ద పండించిన ధాన్యాన్ని మద్దతు రేటుకి కొనుగోలు చేస్తుందని, ఈ రేషన్ పథకాన్ని ఎత్తివేస్తే రైతు పండించిన ధాన్యాన్ని కూడా రైతు అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడుతుందని వారు తెలిపారు. ఒకపక్క కోకో రైతులు, ఇంకోపక్క మామిడి రైతులు, ఇంకోపక్క బర్లి, పొగాకు రైతులు, ఆక్వా రైతులు అమ్ముకోలేక రోడ్లు పాలయ్యారని వారు తెలిపారు. ప్రభుత్వం రేషన్ ఎత్తివేస్తే వరి రైతులకు కూడా వ్యవసాయం గిట్టుబాటు కాక క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి ఏర్పడుతుందని వారు తెలిపారు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రం రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సప్లై చేస్తుందని, కేరళ రాష్ట్రం ద్వారా 16 రకాల నిత్యవర వస్తువులు సప్లై చేస్తుందని, అటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బర్ల బాలాజీ, పెనగన దుర్గారావు, మీసాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మానవత సేవలో భాగస్వాములు కండి

**సంస్థ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు**

ప్రజాశక్తి - ఉండి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేసే సేవలలో భాగస్వాములు అవ్వాలని ఉండి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఆదివారం ఉండిలో మానవత ఉండి శాఖ నెలవారి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేసే భాగ్యం అందరికి దక్కదన్నారు. ఛైర్మన్ రుద్రరాజు యువరాజు, కో ఛైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారి రెండు కన్నీటి బొట్లు అయినా తుడవాలన్నదే మానవత ధ్యేయం అన్నారు. కన్వీనర్ కొమ్మన నాగబాబు, ట్రెజరర్ కట్రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణం, విద్యా వంటి వాటికి మానవత పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రాయి రాములమ్మ, ఆంజనేయులు, ఆర్ఎస్.బాబు, మహేష్, శివవర్మ, తోట ఏసుబాబు పాల్గొన్నారు.

# విద్యాశాఖకు వన్నెతెచ్చిన ఎంఇఒ వేంద్ర వెంకటేశ్వరరావు

**నేడు ఉద్యోగవిరమణ సందర్భంగా ఆత్మీయ అభినందన సభ**

ప్రజాశక్తి - కాళ్ల

సమాజంలో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది భావి భవిష్యత్తుకు మార్గదర్శకులుగా రూపొందించే బాధ్యత వహిస్తున్న ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో గౌరవనీయమైన పాత్ర ఉంది. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించిన ఎంఇఒ వేంద్ర వెంకటేశ్వరరావు కృషి అభినందనీయం. ప్రతి విద్యార్థికి విద్య అందించాలనే లక్ష్యంతో పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న ఎంఇఒ వేంద్ర వెంకటేశ్వరరావు దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించనున్నారు. గత 37 సంవత్సరాల పాటు వెంకటేశ్వరరావు విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాశాఖాధికారిగా వివిధ హోదాల్లో పనిచేసి వృత్తికి వన్నె తెచ్చారు. భీమవరం మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ జిల్లా కేంద్రంలోఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏ బాధ్యత అప్పజెప్పినా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి-2గా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. భీమవరం మండలం, కాళ్ల మండల విద్యాశాఖాధికారి-2గా పనిచేస్తూ ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా భీమవరంలో డాక్టర్ కెఎస్.రాజు ఫంక్షన్ హాల్లో ఆత్మీయ అభినందన సభ జరగనుంది.

**కుటుంబ నేపథ్యం..**

పోడూరు మండలం రావిగొప్పుకు చెందిన వేంద్ర వెంకట్రామయ్య-మీనాక్షి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. వారికి మూడో సంతానం వెంకటేశ్వరరావు. తెలంగాణ ప్రాంతం బెల్లంపల్లిలో 1963 జూన్ 8న జన్మించారు. ఉన్నత విద్యా కుటుంబంలో జన్మించిన వెంకటేశ్వరరావుకు సత్యవతి, శాంతకుమారి ఇద్దరు అక్కలు, సంధ్యారాణి ఒక చెల్లి కలరు.

**విద్యాభ్యాసం..**

తండ్రి వెంకట్రామయ్య ఉద్యోగరీత్యా రెవెన్యూశాఖలో సర్వేయర్‌గా ఉండడంతో వివిధ ప్రాంతాలకు బదిలీ కావడంతో వెంకటేశ్వరరావు విద్యాభ్యాసం వివిధ ప్రాంతాల్లో చేశారు. జగ్గయ్యపేటలో ప్రాథమిక విద్యాభ్యాసం, నరసరావుపేటలో 6, 7 తరగతులను, కర్నూల్‌లో 8, 9 తరగతులు, భీమవరంలో శ్రీచింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్లో పదో తరగతి చదివారు. డిఎన్ఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్, బిఎస్‌సి డిగ్రీ పూర్తిచేశారు. శ్రీకాకుళంలోని రాగోలులో బిఇడి పూర్తిచేశారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్లో ఎంఎస్‌సి పూర్తిచేశారు. వెంకటేశ్వరరావుకు చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో మక్కువ. తండ్రి వెంకట్రామయ్య ఆకాంక్ష మేరకు ఉపాధ్యాయ ఉద్యోగంలోకి చేరారు.


ఎంఇఒ-2 వెంకటేశ్వరరావు దంపతులు

**వివాహం, పిల్లలు..**

1991 జనవరి 26న వేంద్ర వెంకటేశ్వరరావుకు రాధతో వివాహమైంది. ఆయనకు ఒక కుమార్తె, ఒక కుమారుడు కలరు. ఉన్నత విద్యను అభ్యసించి ఇతర దేశాల్లో పనిచేస్తున్నారు. కుమార్తె మౌనిక ఆస్ట్రేలియాలోని హెల్త్ షేర్ విక్టోరియా కంపెనీలో ఇంటి గ్రేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు వేంద్ర వెంకట శ్రీతేజ యుఎస్ఎలో ఆబ్బోట్ ఇన్ మెయిన్ కంపెనీలో క్వాలిటీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. అల్లుడు సురేంద్రన్ ఆస్ట్రేలియాలోని టొయోట కంపెనీలో ఇంటిగ్రేషన్ లీడ్‌గా పనిచేస్తున్నారు.

**ఉద్యోగ ప్రస్థానం..**

1988లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నిడమర్రు మండలం భువనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బిఇడి అసిస్టెంట్ ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్తానాన్ని ప్రారంభించిన వెంకటేశ్వరరావు 1992 జూలై వరకు అక్కడే పనిచేశారు. 1992 ఆగస్టు నుంచి 2001 డిసెంబర్ 10వ తేదీ వరకు కాళ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2001 డిసెంబర్ 11 నుంచి 2009 జనవరి 30 వరకు పెదపాడు మండలం అప్పనవీడు హైస్కూల్లో పనిచేశారు. 2009 జనవరి 31న ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొంది, కాళ్ల మండలం దొడ్డనపూడి హైస్కూల్లో 2009 జూలై 16 వరకు, అదే మండలం ఏలూరుపాడు హైస్కూల్లో 2009 జూలై 17 నుంచి 2015 నవంబర్ 2వ తేదీ వరకు, పాలకోడేరు మండలం గోరగనమూడి హైస్కూల్లో 2015 నవంబర్ 3వ తేదీ నుంచి 2023 జూన్ 7వ తేదీ వరకు, అదే మండలం కుముదవల్లి హైస్కూల్లో 2023 జూన్ 8వ తేదీ నుంచి 2023 జూన్ 18వ తేదీ వరకు ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు. 2023 జూన్ 19వ తేదీ నుంచి భీమవరం మండలం ఎంఇఒ-2గా పూర్తిస్థాయిలో పనిచేస్తూ, 2024 ఆగస్టు ఒకటి నుంచి కాళ్ల మండలంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**విద్యార్థుల ఉన్నతికి..**

అందరిలాకాక కాస్త భిన్నంగా ఆలోచిస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటుపడ్డారు. పలు పాఠశాలల విద్యార్థులకు తన వంతు ఆర్థిక సాయం అందించారు. ఉత్తమ బోధనతో పాటు పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమాలపై ఎక్కువగా ఆయన దృష్టి సారించేవారు. దీంతో విద్యార్థులు ప్రగతి బాటలో నడిచి వివిధ రంగాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరరావు ఎంఇఒగా విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా 2025లో 76వ రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

### ఉపాధ్యాయ వృత్తిలో సంతృప్తి

**వేంద్ర వెంకటేశ్వరరావు, ఎంఇఒ-2, భీమవరం, కాళ్ల మండలం**

నా మొదటి గురువు నా తల్లి మీనాక్షి. ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. గత 37 సంవత్సరాల్లో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దా. ఉన్నతాధికారుల మన్ననలు, ఉపాధ్యాయుల ప్రసంశలు పొందా. కుటుంబ సభ్యుల సహకారం ఉంది. ఉద్యోగ విరమణ అనంతరం నా బావి జీవితంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంతోషంగా ఉంటా. విద్యార్థుల మనసుల్లో మార్పు తీసుకు రావడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటా.

## మొగల్తూరులో వర్షం

**ఆక్వా రైతులకు అదనపు భారం**

ప్రజాశక్తి - మొగల్తూరు

గత ఐదు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లగా ఉంది. రాత్రి వాన కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆక్వా చెరువులలో ఆక్సిజన్ శాతం పడిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. చెరువులలో ఏరియేటర్లు, ఆయిల్ ఇంజన్లను వినియోగించారు. పలువురు రైతులు చెరువులో ఆక్సిజన్ శాతం పెంచేందుకు మందులను వినియోగించవలసి వచ్చింది. దీంతో అదనపు భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## డిఎస్‌సి పరీక్షకు 11 మంది గైర్హాజరు

**భీమవరం :** జిల్లాలో డిఎస్‌సి పరీక్ష ఆదివారం రెండు పరీక్ష కేంద్రాల్లో జరిగింది. 210 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావలసి ఉండగా 199 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 94.76 శాతం హాజరు నమోదైంది. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ తెలిపారు.

## ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

**పాలకొల్లు :** రాష్ట్రంలో ఉన్న ప్రయివేటు విద్యాసంస్థలపై ఆర్‌కె జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన ఆదివారం పాలకొల్లులో నియోజకవర్గ బిసి సంక్షేమ సంఘం నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం అమలు చేయాలని, ప్రయివేట్, కార్పొరేట్ స్కూల్స్, కాలేజీలలో ఫీజులు నియంత్రించాలని, ఫీజుల బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రయివేట్, కార్పొరేట్ సంస్థల్లో విద్యను వ్యాపారంగా చేయకూడదని చెప్పారు. ప్రభుత్వాలు ఎన్ని జిఒలు ఇచ్చినా ప్రయివేటు పాఠశాలల్లో, కళాశాలలో చదువుతున్న పేద మధ్యతరగతి విద్యార్థులకు వాటి ఫలాలు అందడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన జిఒలను అమలు చేయాలని, లేనిచో అటువంటి విద్యాసంస్థలపై ఉద్యమం చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

## బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట

**మొగల్తూరు :** మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో సందడి నెలకొంది. ఆషాడమాసం కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో సభ్యులు ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోక అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి

**ఖండించిన విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్**

**తాడేపల్లిగూడెం :** మహా న్యూస్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంపై దాడి ఘటనపై రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు న్యూస్ టివి ఛానల్ మహా న్యూస్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంపై దుండగులు కర్రలు, రాళ్లతో కార్యాలయం మీద దాడిచేసి బిల్డింగ్ అద్దాలు, కార్ల అద్దాలు పగులగొట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కథనాలు, ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే వివరణ కోరవచ్చు, ఖండన అడగవచ్చు, ఇటువంటి దాడులు క్షమార్హం కాదని అన్నారు. మహా యాజమాన్యానికి సంఘీభావం తెలుపుతున్నానని ఎంఎల్ఎ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ మీడియా ఛానల్ మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని జనసేన తరపున ఖండిస్తున్నానన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు చోటు లేదని, బెదిరింపులు, దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదని అన్నారు. మహా న్యూస్ యాజమాన్యానికి, జర్నలిస్టులకు సంఘీభావం తెలియజేశారు.

## రాష్ట్ర సమావేశానికి టిడిపి నాయకుల హాజరు

**భీమవరం టౌన్ :** టిడిపి రాష్ట్ర సమావేశానికి భీమవరం టిడిపి నాయకులు హాజరు అయినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మంగళగిరిలో రాష్ట్ర స్థాయి సమావేశం జరిగిందని తెలిపారు. సమావేశం అనంతరం ఆయన చంద్రబాబును కలిసినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని అన్నారు.

## నేడు సబ్ కలెక్టరేట్లో పిజిఆర్ఎస్

**నరసాపురం :** నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 30వ తేదీన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నుంచి అందించాలని కోరారు.

## అనధికార మద్యం విక్రయాలపై చర్యలు

**ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి**

ప్రజాశక్తి - తణుకు

అనధికారికంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి హెచ్చరించారు. ఇరగవరం మండలంలో ఆదివారం తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ వారు జరిపిన దాడుల్లో ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎం.సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ ఆర్.మధుబాబుతో పాటు కానిస్టేబుల్ ఫణి భూషన్ పాల్గొన్నారు.